

విశాలాంధ్ర

శ్రీకాకుళం

సోమవారం 9, సెప్టెంబరు 2024

నేడు పాఠశాలలకు సెలవు

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల తీవ్రత దృష్ట్యా నేడు (సోమవారం) స్కూళ్లకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలకు సెలవు ఇవ్వాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన తెలిపారు. సెలవు అంశాన్ని స్కూల్ కమిటీలు ద్వారా, ఆయా వాట్సాప్ ల ద్వారా సమాచారం చేర వేయాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థుల భద్రతకు ఏమాత్రం భంగం కలగని రీతిలో, ఉన్నతాధికారుల ఆదేశాలను తూ.చా తప్పక పాటించాలని అన్నారు. రెసిడెన్షియల్ వసతి గల పాఠశాలలు ఆహార సరుకులైన బంగాళాదుంపలు, కూరగాయలు, పప్పులు, గుడ్లు మొదలైనవి సరఫరాదారుల ద్వారా సేకరించుకొని ఉంచుకోవాలని కోరారు. వసతి గృహాల్లో ఆశ్రయం పొందిన విద్యార్థులు ఎవరూ సంస్థ నుండి బయటకు వెళ్ళడానికి అనుమతి ఇవ్వరాదని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు...అప్రమత్తంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. రానున్న రెండు రోజులపాటు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని నదులు, వాగుల్లో ప్రవాహం పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని ఆయన చెప్పారు. జిల్లా అధికారులతో ఆదివారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. కాజ్ వే, వంతెనలపై నీరు ప్రవహించే చోట్ల పాదచారులు, వాహన చోదకులను నియంత్రించాలని రెవెన్యూ, పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. తీర ప్రాంత మండలాల్లో మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళరాదని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూమ్ ని కొనసాగిస్తున్నామని, వర్షాల కారణంగా భారీ నష్టాలకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే కంట్రోల్ రూమ్ నెం:08942-240557 కు ఫోన్ చేయాలని, అలాగే ఈమెయిల్ ఐడీ (కోఎల్‌కెఎల్‌ఎంఎస్‌యు పీడీటీడీ ఎట్‌జీమెయిల్ డాట్ కాం) ద్వారా

ఫోటోలను పంపించాలని తెలియజేశారు. 08942- 240557 నెంబర్ కు అత్యవసర సమయంలో ఫోన్ చేయాలని, సిబ్బంది వెంటనే అప్రమత్తమై తగు సహాయం చేస్తారని అన్నారు. వినాయక పందిళ్ల వద్ద వర్షాల సమయంలో ఎవరూ ఉండవద్దని, పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఆ దిశగా వినాయక చవితి పందిళ్ళ నిర్వాహకులను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని చెప్పారు. ప్రసవ సమయ తేదీ దగ్గర పడుతున్న గర్భిణీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమీప ఆసుపత్రులలో చేర్చేలా ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో డోలీలపై రోగులను తీసుకొచ్చే పరిస్థితులు ఉండరాదన్నారు. వైద్య సిబ్బంది వారి వారి ఉద్యోగ విధుల్లో అందుబాటులో ఉండాలని చెప్పారు. పూరి గుడిసెల్లో ఎవరూ నివాసం ఉండకుండా వారిని పక్కా భవనాలకు వెళ్లేలా తగు చర్యలు చేపట్టాలని రెవిన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. నదుల్లో పవాహాన్ని ఎప్పటి కప్పుడు అంచనా వేసి సమాచారాన్ని జల వనరుల శాఖ అధికారులు కంట్రోల్ రూం కు చేర వేయాలని చెప్పారు. గండ్లు పడే అవ కాశమున్న చెరువులు, కరకట్టలు, కాలువలపై నిఘా ఉంచి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, వరద ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలను గుర్తించి అవసరం మేరకు వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

విశాలాంధ్ర - టెక్కలి : మండలంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అధికారులు కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. మండల ప్రత్యేక అధికారి, డ్వామా ఏపీడీ ఎం.శైలజ, ఎంపీడీఓ సీహెచ్. లక్ష్మీభాయి పర్యవేక్షణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లోని సమాచారాలు తెలుసుకున్నారు. వర్షం పడుతున్న సమయంలో బయటికి రాకూడదని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు ఏవో హెచ్‌వి.రమణమూర్తి, ఏపీఓ బి.ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ సీపీఆర్ నేర్చుకోవాలి

విశాలాంధ్ర - టెక్కలి : కోటబొమ్మాళికి చెందిన ప్రముఖ న్యాయ వాది లఖినాన శ్రీనివాస్ రావు కుమార్తె డాక్టర్ సంధ్యారాణి నరసన్న పేట, కోటబొమ్మళి మండలాలలో ఫిజియో థెరపీ విధులు నిర్వహిస్తున్నారు. అయితే వినాయక చవితి రోజు విద్యుత్ నగర్ లో ఉంటున్న చిన్నప్పన్న అనే వ్యక్తి అకస్మాత్తుగా స్పృహ కోల్పోయారు. వెంటనే గుండె ఆగినట్టుగా పరిశీలించి డాక్టర్ సంధ్యారాణి సిపిఆర్ చేసి మనిషి ప్రాణాలను రక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సిపిఆర్ నేర్చుకోవాలని సూచించారు. ప్రస్తుతం మానవ మనుగడలో అది చాలా అవసరం అని చెప్పారు. చిన్నప్పన్న కుటుంబంతోపాటు పలువురు ఆమెని ప్రశంసించారు.

డీసీసీబీ కాలనీలోని వినాయక విగ్రహాన్ని దర్శించుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

సీఎం సహాయ నిధికి రూ.20వేలు అందించిన కమిటీ సభ్యులు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : ఓం గం గణపతయే నమః, వినాయక విఘ్నాలు తొలగించవయ్యా అంటూ కేంద్ర పౌరా విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరుకున్నారు. నగరంలోని డిసిసిబి కాలనీ వెంకటేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేసిన మండపంలోని వినాయక విగ్రహాన్ని ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు విజయవాడ వరదల్లో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న ప్రజల సహాయార్థం 20 వేల రూపాయల చెక్కును సీఎం సహాయ నిధికి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి, ఎమ్మెల్యే మానవత్వంతో స్పందించిన డాక్టర్ జి సురేష్ కుమార్ బృందాన్ని అభినందించారు. జిల్లాలో ఎంతోమంది వరద బాధితుల సహాయం కోసం స్పందిస్తుండడం అభినందనీయమని చెప్పారు. తోటి మనిషికి సహాయపడడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఐదు అడుగుల అగరబత్తీలను ప్రారంభించిన ఎమ్మెల్యే, రమణమూర్తి

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో నాయిదు వీధి, కొత్త వీధిలో గత ఇరవై సంవత్సరాల నుండి గణేష్ నవరాత్రులు నిర్వహిస్తున్న రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్, పీరు ఎర్రయ్య పిలుపు మేరకు ఆదివారం నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి వరసిద్ధి వినాయకుడును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ నిర్వాహకులు, ఎమ్మెల్యే, రమణమూర్తిని స్వాగతం పలికగా, ఎమ్మెల్యే, ప్రత్యేకంగా స్వామివారికి పూజలు చేసి, ఐదు అడుగుల అగరబత్తీలను ప్రారంభించారు. అనంతరం కమిటీ ప్రతినిధులు, ఎమ్మెల్యే, రమణమూర్తికి శాలువ కప్పి, ఘనంగా సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, సాసుపల్లి కృష్ణబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్, ఖైరి భాస్కరరావు, మాజీ ఎంపిటిసి, తాళాబత్తుల గోవిందరావు, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

వంశధార నదీతీర గ్రామాలను సందర్శించిన తహశీల్దార్

విశాలాంధ్ర - నరసన్నపేట : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వంశధార నది నీటి ఉధృతి ఎక్కువ కావటంతో ఆదివారం తహశీల్దార్, టి.సత్యన్నారాయణ, ఎంపిడివో, బి.మధుసూధనరావు మడపాం పంచాయితీ గ్రామాలను సందర్శించారు. ఈ సంధర్భంగా వారు వంశధార నీటిని పరిశీలించి, బుచ్చిపేట, చేనుల వలస గ్రామాలకు వెళ్ళి, రాత్రి వేళల్లో గ్రామస్థులు బయటకు వెళ్ళకుండా అప్రమత్తంగా వుండాలని, వరద నీరు ఎక్కువగా వస్తుందని వంశధార అధికారులు సమాచారం అందించారని తెలిపారు. గ్రామస్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా విఆర్‌వోలు అందుబాటులో వుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్వో, మారెల్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వినాయకుని ఉత్సవాలు

విశాలాంధ్ర - మందస : మండలంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అన్ని గ్రామాల్లోను, పట్టణాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వినాయక మండపాలకు వందలాది మంది భక్తులు సందర్శిస్తున్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. మండలంలో కిల్లోయి గిరిజన కాలనీలో వినాయకుని మండపం వద్ద కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు పంచారు.

చెరువులో పడి గేద మృతి

విశాలాంధ్ర - రణస్థలం : మండల కేంద్రంలోని జేఆర్ పురం గ్రామంలో గంగి నాగమణికి చెందిన గేదె ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందింది. అల్పపీడనం కారణంగా వర్షాలకు చెరువుగట్టున జారుగా ఉండడంతో గేద ప్రమాదవశాత్తు జారి పడి పోయింది. సుమారు రూ.70 వేలు విలువ చేసే గేదె చని పోయింది. రణస్థలం పశుసంవర్ధకశాఖ ఏడిబి దుర్గారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్య క్రమంలో వీఆర్వో దేవి, పశుసంవర్ధక శాఖ వైద్యులు చంద్రశేఖర్, లావణ్య, గాయత్రి, అసిస్టెంట్ జే.సాయి ఉన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వలన ప్రజలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా వారికి అందు బాటులో ఉంటూ అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్ మండల స్థాయి అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. వర్షాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు అప్రమత్తత కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాళీప్రసాద్, తహశీల్దార్ వైవి.పద్మావతి, ఈవోపిఆర్డీ పద్మజ, విద్యాశాఖ, పంచాయితీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నదీ తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : వాయుగుండం కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు వలన వంశధార నదీతీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల టిడిపి నాయకులు అన్నారు. ఆదివారం పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదేశాల మేరకు మండల నాయకులు నదీ తీర గ్రామాలైన వాడవలస, దబ్బపాడు, మిరియాపల్లి తధితర గ్రామాలలో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కె.కృష్ణమాచారి, వెలమల గోవిందరావు, అంపిలి పోలి నాయుడు, నడిపిల్లి నారాయణరావు,జమ్మి మోహనరావు, శివ్వాల తేజేశ్వరరావు, కొమరాపు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపు

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడిన ప్రభావంతో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ సూ చించారు. రూరల్ మండలంలోని కుందువానిపేటలో హుదూద్ ఇళ్లను ఆదివారం ఆయన పరిశీలించారు. స్లాబులకు పూర్తిగా పెచ్చులూడిపోయి వర్షపు నీరు ఇళ్లల్లోకి కారిపోతుండడాన్ని ఆయన గమనించారు. కూలి పోయేందుకు భవనాలు సిద్ధంగా ఉన్నాయని తమను ఆదుకోవాలని ప్రజలంతా ఎమ్మె ల్యేను వేడుకున్నారు. రోజంతా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. అధైర్యపడవద్దని త్వరలోనే మీ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూ చించారు. వర్షాల కారణంగా ఎటువంటి ప్రాణ నష్టం జరగకూడదని, శిథిల భవనాల్లో ఉన్నవారిని అప్రమత్తం చేయాలని వారికి చెప్పారు. జోరు వానను సైతం లెక్కచేయక ప్రజలను రక్షించేందుకు ఆయన కుందువానిపేటలో పర్యటించడంపై పలువురు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. ప్రమాదం జరగకముందే ప్రజలను అప్రమత్తం చేయడమే నిజమైన నాయకుడు లక్షణమని, ఆ నాయకత్వ లక్షణాలు ఉన్న ఎమ్మెల్యే శంకర్ తమతో ఉండడంతో తమ అదృష్టమని ప్రజలంతా శంకర్ కు అభినందనలు తెలుపుతున్నారు.

వైసీపీ తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా మామిడి శ్రీకాంత్

విశాలాంధ్ర - కొత్తూరు : రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులుగా మామిడి శ్రీకాంత్‌ను ఆ పార్టీ అధిష్టాన వర్గం నియమించింది శ్రీకాంతను కొత్తూరు వైసిపి నాయకులు మాజీ ఏ.ఎంసి. చైర్మన్ గోగుల మాధవీ వరప్రసాద్ రావు స్థానిక పార్టీ శ్రేణులు శాలువా కప్పి బోకే ఇచ్చి సన్మానించారు. కాగా గతంలో తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా అధికారంలో ఉన్న మామిడి శ్రీకాంత్ పాతపట్నం నియోజిక వర్గంలో కొంత అనుచర గణం ఉంది ఇక్కడ నుండి పోటీ చేయాలని భావించి వైసిపి టికెట్ సాధించడంలో విఫలమయ్యారు. పాతపట్నంలో వైసిపిని పటిష్ట పరచడం మామిడి శ్రీకాంత్ తగినంత శ్రద్ధ చూపలేదు అన్న విమర్శలున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - మందస : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రధానో పాధ్యాయులు ఎస్ ఎర్రమనాయుడు అన్నారు. ఆదివారం 'శ్రీ సత్య సాయి ప్రేమ తరు' కార్యక్రమంలో భాగంగా శ్రీ సత్య సాయి సేవా సమితి, మందస మరియు విజి పురం అధ్వ ర్యంలో విజి.పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలను కాపాడుకునేందుకు మొక్కలు నాటడం చాలా అవసరం అని వాటిని సంరక్షించుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సహ ఉపాధ్యా యులు పి.మల్లిఖార్జున రావు, బి.వెంకట్రావు, మాధవరావు, గంగాధర్, సర్పంచ్ కె.గోపాల కృష్ణ, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ చైర్మన్ కుమారస్వామి, సాయి భక్తులు పలాస ఎంఈఓ సి హెచ్ సత్యం, పలాస జోనల్ కన్వీనర్ బి.బైరాగి, మందస సమితి కన్వీనర్ వి.ఈశ్వరరావు, కో ఆర్డినేటర్ డబ్లు. అప్పారావు, పలాస సమితి కన్వీనర్ డి.జగదీష్, మందస సమితి సభ్యులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలంలో బైపల్లి గ్రామ సమీపం శివసాగర్ బీచ్‌లో ఉన్న శ్రీనీలకంఠేశ్వర ఆలయం ప్రాంగణంలో ఉన్న శ్రీఅభయ గణపతి ఆలయ నిర్మించి సుమారు 13 ఏళ్లు అయిన ఆలయ కమిటీ సభ్యురాలు తామాడ సరస్వతమ్మ తెలిపారు. అభయ గణపతి ఆలయం కోసం నిరంతరం శ్రమించి పని చేసిన ఆలయ కమిటీ అధ్యక్షులు మద్దు నాగేశ్వర రావును కమిటీ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది వినాయక చవితి అభయ గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తుంటామని తెలిపారు. అలాగే ఆయనతో పాటు చెల్లూరు క్రిష్ణారావు, తామాడ సరస్వతమ్మలకు కూడా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పువ్వల ఈశ్వరరావుతో పాటు సింగుపల్లి బాలక్రిష్ణలు పాల్గొన్నారు.

పికెఎస్ మహాసభ విజయవంతం

విశాలాంధ్ర - పలాస : ప్రగతి శీల కార్మిక సమాఖ్య శ్రీకాకుళం జిల్లా రెండో మహాసభ బొడ్డపాడు గ్రామంలో అమరుల స్మారక భవనం వద్ద ఆదివారం పికెఎస్ జిల్లా అధ్యక్షులు దేవాడ నారాయణమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా జిల్లా కార్యదర్శి పుచ్చా దుర్యోదన జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె.మస్తాన్ మాట్లాడుతూ కార్మిక చట్టాలు, హక్కులు గురించి వివరించారు. పికెఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు అన్నపూర్ణ కేంద్ర ప్రభుత్వం కొత్తగా చట్టాల సవరణ చేస్తూ కార్మిక, ప్రజల హక్కులు హరిస్తుందని అన్నారు. పికెఎస్ రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం ఉపా లాంటి నల్ల చట్టాలు తెచ్చి ప్రజాస్వామిక వాదులను అక్రమ కేసులు పెట్టి జైల్లో నిర్బందిస్తూ అప్రకటిత ఎమర్జెన్సీ విధానం అమలు చేస్తుందని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో పి.ధర్మారావు, బి.ప్రబాకర్, జోగి కోదండ, ఎస్.అడ్డి, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా అధ్యక్షులుగా మద్దిలి ధర్మారావు, ఉపాధ్యక్షులుగా కారి పురుషోత్తం, జి.కూర్మారావు, ప్రధాన కార్యదర్శిగా పుచ్చ దుర్యోదన, సహాయ కార్యదర్శిగా కుత్తుం ఢిల్లీరావు, మామిడి గణపతి, కోశాధికారి దేవాడ నారాయణమూర్తి, కార్యవర్గ సభ్యులు మజ్జి పాపారావు, ఎం.రాజారావు, ఎస్.ఈశ్వరరావు, ఎం.షణ్ముఖరావు, అందాల కోటి, తెలుకల రుషికేశ్వరరావు, బి.మోహనరావులు ఎన్నికయ్యారు.

శ్రీ విఘ్నేశ్వర తులాభారంను దర్శించుకున్న ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర - నరసన్నపేట : పట్టణంలో గాంధీనగర్-1వ వీధి శ్రీ లక్ష్మీ రెసిడెన్సీలో వినాయక చవితి పండుగ సంధర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ విఘ్నేశ్వర తులాభారం విగ్రహం పలు వురిని ఆకట్టుకుంది. తులాభారంలో ఒకవైపు విఘ్నేశ్వరుడు, మరో వైపు లడ్డుతో దర్శనమిస్తున్న వినాయ కున్ని నియోజకవర్గ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురువడంతో విజయవాడ పట్టణమంతా వరద నీటితో నిండిపోయిందని, దీనితో ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిందని, అలాగే మన నియోజకవర్గంలో సక్రమంగా పెరుగుతున్న ఖరీఫ్ వరి పంట వర్షాలకు మునిగిపోతుందని రైతన్నలు భయాందోళనలకు గురి అవుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా కమిటీ సభ్యులు భాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయితీ వైస్ సర్పంచ్, కమిటీ ప్రతినిధి, సాసుపల్లి కృష్ణబాబు, ఎ.ఎం.సి మాజీ ఛైర్మన్, ఖైరి కస్పా ప్రసాద్, జి.కే, శ్రీలక్ష్మీ రెసిడెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో ముంపునకు గురైన 'పేట'

విశాలాంధ్ర - నరసన్నపేట : గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు నరసన్నపేట ముంపునకు గురైంది. పట్టణం నుండి గొట్టిపల్లి గ్రామానికి వెళ్ళే రహదారిపైకి పొలాల నుండి వచ్చిన వర్షం నీరు ఎక్కువై రహదారిపై నుండి ప్రవహించటంతో ఎస్.ఐ, సిహెచ్.దుర్గాప్రసాద్ గొట్టిపల్లి అండర్ పాస్ బ్రిడ్జి క్రింద వుండి, గ్రామస్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. అలాగే సత్యవరం జంక్షన్ వద్ద చెరువులోకి వ్యవసాయ భూముల నుండి వచ్చిన నీరు కారణంగా గ్రామానికి వెళ్ళే రహదారిపై నుండి నీరు ప్రవహించటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురైనారు. అలాగే పట్టణంలో శ్రీదేవినగర్ వర్షం నీటికి ముంపుకు గురైంది. ఇక బజారు వీధిలో పరిస్థితి చెప్పనక్కర్లేదు, ఇరుకుగా వున్న బజారువీధిలో వర్షం నీరు ఎక్కువగా నిల్వ అయ్యింది. మురికి కాలువలు చిన్నవిగా వుండటంతో వర్షంనీరు వేగంగా వెళ్ళకపోవటంతో బజారువీధి చెరువులా దర్శనమిస్తుంది. భారీ వర్షాలు పడిన ప్రతీసారి వర్షం నీరు నిల్వ వుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. నిల్లనీటిని త్వరితగతిన పంచాయితీ అధికారులు బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

కిడ్నీ ప్రభావిత గ్రామాలకు శుద్ధ జలం కరవు...

కిడ్నీ మహమ్మారికి బలవుతున్న ఉద్దానం ప్రజలు..!

విశాలాంధ్ర - పలాస/మందస : ఉద్దాన గ్రామాల్లో రోజూ మృత్యు ఘంటికలు మ్రోగుతూనే ఉన్నాయి. ఆప్తులను కోల్పోయిన వారి రోదనలు మిన్నంటూతునే ఉన్నాయి. శవాలను మోసి..మోసి వారి భుజాలలో కాయలు కాస్తూనే ఉన్నాయి. అయినా ఉద్దాన ప్రాంత కిడ్నీ రోగులకు సాంత్వన కరువైంది. పాలకుల చర్యలు కంటి తుడుపుగా మారాయి. కిడ్నీ మహమ్మారి మూలాలు కనుగొనేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్న దాన్ని జాడ ఇప్పటికీ కనుగొనలేకపోతున్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం శుద్ధ జలం అందించినా, వైసిపి ప్రభుత్వం శుద్ధ జలం ప్రాజెక్టు ప్రారంభించిన కిడ్నీ బాధిత గ్రామాలకు అరకొర గానే శుద్ధ జలం అందుతోంది. కిడ్నీ ప్రభావిత గ్రామాల ప్రజలకు రోజువారి సరఫరా చేయటం లేదు. పాలకవర్గాలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆవేదన ప్రజల్లో వ్యక్తమౌతోంది. పాలకులు,రాజకీయ పార్టీ లు ఆర్థికంగా బలపడేందుకే ప్రయత్నం చేస్తున్నారే...తప్ప కిడ్నీ ప్రభావిత గ్రామాల ప్రజల కోసం, కిడ్నీ బాధితుల కోసం పట్టించుకోవటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కిడ్నీ ప్రభావిత ప్రాంతాలైన ఉద్దానం, మైదానం, గిరిజన ప్రాంతాల్లో ప్రతి రోజు చావు బాజాలు మోగుతూనే ఉన్నాయి. ఉద్దానం ప్రాంతం యువతి యువకులకు పెళ్లి సంబంధాలు కూడా జరగని పరిస్థితి నెలకొంది. వందలాది మంది కిడ్నీ బాధితులు కొత్తగా సామాజిక పెన్షన్ల కోసం దరఖాస్తులు సచివాలయంకు అందజేసి ఏడాది కాలం అవుతున్నప్పటికీ పింఛన్లు మంజూరు కావడం లేదు. ఉద్దాన ప్రాంతంలో అయితే ప్రతి పంచాయతీలో వందలాది మంది కిడ్నీ బాధితులు ఉన్నారు. వీరంతా చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. కిడ్నీ వ్యాధి ప్రబలడానికి కారణాలు ఇంత వరకు బయటపడలేదు. అప్పుడప్పుడు ఈ వ్యాధి పై పరిశోధనలు అంటూ ప్రజలకు హామీలు ఇచ్చి రెండు దశాబ్దాలు పాటు ప్రభుత్వాలు కాలం గడిపేసాయి. గత రెండు దశాబ్దాలుగా వేలాది మంది కిడ్నీ వ్యాధి బారిన పడి మృత్యువాత పడుతున్నారు. గతంలో ప్రధానమంత్రి బీమా పథకం అమలులో ఉండేది. 2020 మార్చి నుంచి ఈ పథకాన్ని కేంద్రంలో పాలించిన బిజెపి ప్రభుత్వం రద్దు చేయడంతో మృతి చెందిన కిడ్నీ రోగుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం పూర్తిగా అందడం లేదు. ఇకపోతే కరోనా ప్రభావంతో మృతి చెందిన కుటుంబాలకు కూడా భీమ సాయం

అందలేదు.గతంలో రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ ప్రభుత్వ పాలనలో 50 ఏళ్ల వయసు లోపల ఎవరైనా పేదలు మరణిస్తే సుమారు ఒక లక్ష రూపాయలు వరకు మాత్రమే ఆర్థిక సాయం అందించారు.ఈ ఆర్థిక సహాయం కూడా ప్రస్తుతం నిరుపేదలు అనారోగ్యంతో మరణిస్తే అందడం లేదు. గత ఎనిమిది నెలల నుంచి ఈ పథకం కింద ఆర్థిక సాయం మంజూరు చేయటం లేదు. ప్రజల జీవితాలతో పాలకవర్గాలు ఆటలాడుకుంటున్నాయన్న ఆవేదన అన్ని వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి.కిడ్నీ వ్యాధి ప్రభావిత ప్రాంతాల ప్రజలకు శుద్ధ జలం అందించేందుకు 2014 లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి మేరకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో శుద్ధ జలం ట్యాంకులను ఏర్పాటు చేసింది. ఎన్టీఆర్ సుజల ధార పథకం కింద తయారు చేసే కేంద్రాలు అక్కడక్కడ ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో శుద్ధ జలం తయారు చేసే అధునాతనమైన పరికరాలు కూడా అప్పట్లో కోట్లాది రూపాయలు ఖర్చుతో ఏర్పాట్లు చేశారు. ఆర్ డబ్ల్యు ఎస్ శాఖ పరిరక్షణలో ఈ పథకాన్ని కొనసాగించారు. 2019 లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ సుజల ధార పథకాన్ని పట్టించుకోకుండా ఆ శాఖ గాలికి వదిలేసింది. పర్యవేక్షణ కూడా సక్రమంగా లేకపోవడంతో 80 శాతం వరకు గ్రామాల్లో ఉన్న ఎన్టీఆర్ శుద్ధ జల ట్యాంకులు పనిచేయకుండా మూలన పడ్డాయి. దీంతో కిడ్నీ ప్రభావిత ప్రాంత ప్రజలకు ఎన్టీఆర్ శుద్ధ జలం అందటం లేదు. ఇకపోతే 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కిడ్నీ ప్రభావిత ప్రాంతాలకు శుద్ధ జలం పంపిణీ చేయాలన్న సంకల్పంతో సుమారు700 కోట్ల రూపాయల వ్యయంతో హిరమండలం వద్ద ప్రత్యేక మంచినీటి పథకం, 50 కోట్ల రూపాయల వ్యయంతో పలాస వద్ద 200 పడకల కిడ్నీ ఆసుపత్రి మరియు పరిశోధన కేంద్రం నిర్మాణానికి కృషి చేశారు. పలాస ఇచ్చాపురం పాతపట్నం అసెంబ్లీ నియోజకవర్గాల్లో శుద్ధ జలం అందించడానికి ఇంటింటా మంచినీటి కొళాయిలు ఏర్పాటు చేశారు. నీటి నిల్వ కోసం గ్రామాల్లో ట్యాంకులు ఏర్పాటు చేయడానికి పైప్ లైన్ నిర్మాణం కోసం కృషి జరిగింది. 2024 పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికలు నోటిఫికేషన్ రాక ముందు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ పథకాన్ని, కిడ్నీ పరిశోధన కేంద్రంను ప్రారంభించారు. అయితే ఈ పథకంపై సంబంధిత శాఖ పర్యవేక్షణ లోపంతో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. గ్రామాల్లో 50 శాతం వరకు కుళాయిలు పూర్తిగా పనిచేయడం లేదు. సరఫరా చేస్తున్న నీరు కూడా కుళాయిల ద్వారా అరగంట కూడా ఇవ్వడం లేదు. పేరుకు మాత్రమే శుద్ధ జలం కానీ బురద నీరును అరకొరగా సరఫరా చేస్తున్నారు. ఇప్పటికే అనేక గ్రామాలకు కొళాయిల ద్వారా తాగునీరు పూర్తిగా అందడం లేదు. పర్యవేక్షణ శాఖ ఈ పథకంను కూడా నీరు గార్చే విధంగా గాలికి వదిలేస్తున్నారు. కుళాయిలు ఏర్పాటు సక్రమంగా జరగలేదు. గ్రామాల్లో ట్యాంకులు పైప్ లైన్లు పనులు నాసిరకంగా జరగడంతో పైప్ లైన్లు పాడయ్యాయి. ప్రస్తుతం పరిమితంగా కొళాయిల ద్వారా అందిస్తున్న రంగు మారిన నీరు కూడా ఒక రోజు ఇస్తే మరో రోజు ఇవ్వరు. 100 శాతం కిడ్నీ ప్రభావిత గ్రామాల్లో అయితే ఇంటింటి కుళాయిలు పనిచేయక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా కిడ్నీ వ్యాధి మరింత ప్రబలకుండా, ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోకుండా టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కిడ్నీ మహమ్మారి నుండి ప్రజల ప్రాణాలు కోల్పోకుండా కాపాడాలని కిడ్నీ భాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు మేం సైతం..భాష్యం ఆదర్శం

విశాలాంధ్ర - పొందూరు : రాష్ట్రంలోని వరద బాధితులకు ఆదుకునేందుకు విద్యార్థులు సైతం ముందుకు రావడాన్ని స్వాగతించాల్సిందే. ఈ మేరకు స్థానిక భాష్యం స్కూల్ విద్యార్థులు ఓ అడుగు ముందుకేశారు. ఆ పాఠశాల యాజమాన్యం ఇచ్చిన పిలుపు మేరకు విద్యార్థులు స్థానిక,పరిసర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి విరాళాలు సేకరిస్తున్నారు. ప్రజలు కూడా వారు అడిగిందే తడవుగా ఎంతో సంతోషంతోనే విరాళాలు అందించడం విశేషం. వినాయక నవరాత్రుల చందాలకైతే కొంత మేరకు విసుక్కుంటున్నా.వరద బాధితులకు అనేసరికి స్వచ్ఛందంగా తమకు తోచినంత మొత్తాన్ని అందజేసి ప్రోత్సాహించడం కొసమెరుపు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పోలాకి : ప్రజలు అన్నివేళలా అప్రమత్తంగా ఉండాలని ప్రస్తుత వర్షాల ప్రభావం వలన ప్రభుత్వ సూచనలు పాటించాలని పోలాకి ఠాణా అధికారి రంజిత్ అన్నారు. ఆదివారం మండలంలో పలు లోతట్టు ప్రాంతాలను సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు. పల్లిపేట, గోవిందపురం, డోల, జొన్నం, వనితమండలం గ్రామాల్లో పర్యటించారు. ప్రస్తుతం భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలని సూచించారు. మూగ జీవాలను సంరక్షించుకోవాలని కోరారు. సమస్య ఉన్న యెడల ప్రభుత్వ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఆయనతో పాటు సిబ్బంది మూర్తి, వాసు ఉన్నారు.

భారీ వర్షాలు కారణంగా నేడు మీకోసం వినతుల కార్యక్రమం రద్దు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : నేడు అనగా సెప్టెంబర్ 09, సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించుట లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ప్రతి సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (మీకోసం) వినతుల స్వీకరణ కార్యక్రమం జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల తీవ్రత కారణంగా సెప్టెంబర్ 09వ తేదీ నిర్వహించడం లేదని, కావున జిల్లాలో ప్రజలు వ్యయ ప్రయాసలకు లోనై వినతులు అందజేయుటకు రావద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆకట్టుకుంటున్న మట్టి గణపతి



విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో చిన్నపల్లివీధిలో స్థానిక యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టిగణపతి ఆకట్టు కుంటుంది. 6 అడుగుల ఎత్తైన పరశురాముని అవతారంలో అం దంగా రూపొందించిన ఈ విగ్రహంను బీహార్ రాష్ట్రంకు చెందిన కళాకారులు తయారు చేశారు. 9 రోజుల పాటు వైభవంగా పూజలు నిర్వహించనున్నట్లు చిన్నపల్లి వీధి యువకులు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే విధంగా మట్టి విగ్రహాన్ని ఎంచు కున్నట్లు తెలిపారు. దీంతో పాటు సోంపేటలో సుమారుగా ప్రతి వీధిలోను అందమైన గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు, భజనలతో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అనేక గ్రామాల్లోను ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.

వంతెన ఖానాలలో చెత్త తొలగింపు

విశాలాంధ్ర - పొందూరు : మండలకేంద్రంలో రాపాక రోడ్డులో పొన్నులగెడ్డపై ఉన్న ఖానాల వద్ద పూడికలు, చెత్తలను ఆదివారం పంచాయతీ అధికారులు తొలగించారు. దశాబ్దాలుగా పూడికలు తొలగించకపోవడంతో రెండురోజులుగా కురుస్తున్న భారీవరాలకు వెన్నుల గెడ్డలో పెరిగింది. అయితే పూడికలు కారణంగా నీరు బానీలనుంచి వెళ్ళకపోడంతో ప్రక్కనే ఉన్న ఎరుకల కాలనీలోకి నీరు చేరుతోంది. దీంతో కాలనీవాసుల ఫిర్యాదుతో పంచాయతీ ఈవో మోహన్ బాబు జేసీబీతో చెత్తను. పూడికలను తొలగించారు. ఈ పనులను మాజీ ఎంపీపీ కూన ప్రమీల, టీడీపీ నాయకులు చీగిలిపల్లి రామ్మోహన్, అనకాపల్లి శ్రీరంగనాయకులు (చినరంగ) బలగ శంకరబాస్కర్, బాడాన శేషాగిరినాయుడు తదితరులు పరిశీలించారు.

10 నుంచి గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

విశాలాంధ్ర - సోంపేట : వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అనుబంధ శాఖలతో కలిసి ఖరీఫ్ రైతాంగానికి మరింత అవగాహన పెంపొందించే విధంగా ఈ నెల 10 నుంచి పొలం పిలుస్తోంది పేరిట వ్యవసాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బొర్ర నర్సింహ మూర్తి తెలిపారు. మొదటి రోజున పాత్రఖండ, కర్తలిపాలెం గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వ హిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ, పశుసంవర్ధకశాఖ, పాడిపరిశ్రమ, మత్స్య శాఖ, నీటిపారుదల, మార్కెటింగ్, ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ ఆదివారం విడుదల చేశారు.

అధిక ధర పలికిన వినాయక లడ్డు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని ప్రగడపుట్టుగ మారేడు దుర్గా కమిటీ ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు వినాయక ప్రసాదంగా ఉంచిన లడ్డూను వేలం పాట చేపట్టారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన ప్రియ విశ్వేశ్వరరావు,అట్టడ నరసన్న దంపతులు 27 వేలు రూపాయలుకు లడ్డు ప్రసాదాన్ని కైవసం చేసుకున్నారు.

ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేయాలి

విశాలాంధ్ర - టెక్కలి : మండల మహాసభలు అధ్యక్షులు పి గణపతిరావు అధ్యక్షతన ఆదివారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నూతన మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అధికారిగా జిల్లా సహాధ్యక్షులు కే దాలయ్య,ఎన్నికల పరిశీలకులుగా జిల్లా కార్యదర్శి బి శంకరరావు హాజరయ్యారు. ఈ కార్యక్రమము ఉద్దేశించి జిల్లా సహాధ్యక్షులు కే దాలయ్య మాట్లాడుతూ యూటీఎఫ్ ఉద్యమ చరిత్రను, కరోనా నుండి నేటి వరద బాధితుల సహాయార్థం వరకు యుటిఎఫ్ చేస్తున్న సేవలను వివరించడం జరిగినది. ప్రభుత్వము ప్రభుత్వ విద్య రంగాన్ని కాపాడవలసిన బాధ్యత నుండి తప్పుకోకుండా ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేయాలని, 117 జీవోని రద్దు చేసి 1 నుండి 5 తరగతులు ప్రాథమిక పాఠశాలలో ఉండునట్లు అదేవిధంగా ఉన్నత పాఠశాలలో సమాంతర మాధ్యమాలు ఉండునట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు భవిష్యత్తులో జరుగు ఉద్యమ పోరాటాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, నవంబర్ నెలలో మందసలో జరుగు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని, అదేవిధంగా డిసెంబర్ నెలలో కాకినాడలో జరుగు రాష్ట్ర స్వర్ణోత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి బి శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతములో భాగంగా ప్రతి యుటిఎఫ్ కార్యకర్త అదనంగా ఒక గంట పని చేసి విద్యార్థుల తల్లిదండ్రులు విద్యావ్యవస్థ వైపు కార్యోన్ముఖులు చేసి విద్యావ్యవస్థను కాపాడవలసినదిగా కోరారు. నూతన మండల కమిటీ అధ్యక్షులుగా ఎం కుమారస్వామి రాజు, అధ్యక్షులుగా పి గణపతిరావు, ప్రధాన కార్యదర్శిగా టీ.వైకుంఠరావు, కోశాధికారిగా ఆర్ విజయ్ కుమార్‌లను మరియు సహాధ్యక్షులుగా ఎస్.ప్రభావతి, డి పాపారావులను, మండల కార్యవర్గ సభ్యులను జిల్లా కౌన్సిలర్లను ఆడిట్ కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కార్యకర్త పి ధర్మారావు మాట్లాడుతూ యూటీఎఫ్ లో పనిచేయడం ఒక వరమని అదే విధంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యూటీఎఫ్ ముందుంటుందని అనేక సంవత్సరాలు కష్టపడి యూటీఎఫ్ ను ఈ స్థాయికి తీసుకొని రావడం జరిగిందని, సమస్య ఎక్కడుందో యుటిఎఫ్ అక్కడుంటుందని తెలియజేశారు. రాష్ట్రంలో మొనగాడి సంఘముగా ఉంటూ సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ పాత్ర వివరించడం జరిగినది.డి వైకుంఠరావు, సత్తార్ రాంబాబు, బి వెంకట్రావు, సిహెచ్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, అబ్బాస్ అలీ బాపూజీ, వై గణపతి రావు, ఈ వైకుంఠరావు, బి లత, రమేష్ కుమారు, శ్రీనివాసరావు, ఆర్ రమేష్ కుమార్, బి శ్రీనివాసరావు, అనేక మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగావళి పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మార్వో రాంబాబు

విశాలాంధ్ర - ఆమదాలవలస : వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షా లు కారణంగా నాగావళి నది ప్రవాహ వేగం అధికంగా ఉన్నందున రానున్న కాలంలో వరద ఉధృతి ఎక్కువ పరివాహక ప్రాంతాల్లో నీరు చేరే ప్రమాదం ఉన్నందున ఈ ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ అధికారి ఎమ్మార్వో రాంబాబు తెలిపారు. ఆదివారం నాగావళి నది పరివాహక ప్రాంతమైన కలివరం తదితర గ్రామాలను పర్యటించారు. ముద్దాడపేట దరి లోని వరద కట్టను పరిశీలించారు. గతంలో కలివరం వద్ద నిర్మించిన ఆర్ బి కే కార్యాలయం నాగావళి వరద ఉధృతికి కొట్టుకుపోయింది. అప్పటి అధికారులు సభాపతి తమ్మినేని సీతారాం గ్రామం కావడంతో ప్రకృతి ప్రకోపానికి ఆర్‌బి కే కొట్టుకుపో యినట్లు నివేదికలు సమర్పించు కున్నట్లు తెలిసింది. అన్ని శాఖల అనుమతులు లేకుండా నిర్మించినప్పటికీ ఆ విషయమై అధికారులు నోరు మెదపలేదు. ప్రస్తుతం నాగావళి నదిలో నారాయణపురం ఆన కట్ట వద్ద 18,500 క్యూసెక్కులు వరద నీరు ఇన్ఫ్లో వస్తుండగా అంతే స్థాయిలో నీటిని విడుదల చేశారు. ఒరిస్సా ప్రాంతా నికి అధిక వర్షాలు కురవడంతో నదీ ప్రవా హం ఉధృతంగా ఉందని ఇరిగేషన్ ఎస్ ఈ సుధాకర్ తెలిపారు. ఇప్పటికే 29.5 మీటర్ల నీరు ఆనకట్ట వద్ద ఉందన్నారు. ఇన్ఫ్లో అధికమైతే దిగువ ప్రాంతాలు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందని తెలి పారు. ఇప్పటికే యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసిందని దీనికి తగిన హెల్ప్ లైన్ నెంబర్ ను కూడా కలెక్టర్ కార్యాల యంలో ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారని ఎంపీడీవో తెలిపారు. వరద పరిస్థితి ఎప్పటికప్పుడు అధికారులకు నివేదిస్తున్నామని ప్రస్తుతం అంత ప్రభావంతమైన ఉధృతి లేదని ఎగువ నుంచి మద్దువలస నీరు అధికమైతే ప్రవాహ ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు వివరించారు. ఏది ఏమైనప్పటికీ ప్రజలు భారీ వర్షాలు, అల్పపీడనం దృశ్య అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే సచివాలయ సిబ్బందిని గ్రామస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని అన్నారు. ఆయనతోపాటు స్థానిక ఎస్సై వెంకటేష్ రెవెన్యూ అధికారులు సచి వాలయం సిబ్బంది ఉన్నారు.

పెసర గణపతిని దర్శించుకున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

విశాలాంధ్ర - కవిటి : మండలంలోని బొరివంక గ్రామంలో ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏర్పాటు చేసిన మొలకెత్తిన పెసర గింజలతో తయారుచేసిన వినాయకుడిని స్థానిక ఎమ్మెల్యే బి.అశోక్ బాబు, ఎమ్మెల్సీ నర్తు రామారావు లు దర్శించుకున్నారు. ఉద్దానం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా పర్యావరణానికి హాని కలిగించకుండా వివిధ రకాల ఎకో ఫ్రెండ్లీ గణనాథులని తయారు చేయడం ఆ క్లబ్బు ప్రత్యేకత. అందులో భాగంగానే ఆ విగ్రహాన్ని దర్శించుకునేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలు వచ్చి గణ నాథుని దర్శించుకుంటున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ తదితర ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు వివిధ స్థాయి అధికారులు ఈ పెసర గణపతిని దర్శించుకున్నారు.

మండలంపై భారీ వర్షాల ప్రభావం

విశాలాంధ్ర - పొందూరు : మండలంపై అల్పపీడనం ప్రభావంతో కురుస్తులు భారీ వర్షాలు తీవ్ర ప్రభావాన్ని చూపు తున్నాయి. శనివారం సాయంత్రం నుంచి బారీ వర్షాలు కురుస్తుండడంతో వర్షపునీరు పొలాల్లో చేరుకుంది. చినబొడ్డేపల్లి గ్రామం వద్ద అండర్ ప్యాసేజిలో 8 అడుగుల నీరు చేరడంతో నీటిలో కారు, ట్రాక్టర్, ద్విచక్రవాహనాలు చిక్కుకున్నాయి. దీంతో ఎటువంటి ప్రమాదం జరుగకుండా అండర్వ్యాసేజి వద్ద పోలీసులను కాపలాగా ఉంచారు. అండర్వ్యాస్తేజీలో నిలిచిన నీటిని మండల ప్రత్యేకాధికారి ఓ నగేష్ పరిశీలించారు. మండలకేంద్రంలోని జగనన్న కాలనీకి వెళ్ళే రోడ్డు పైనుంచి పైడికొండ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కాలనీకి రాకపోకలు ఇబ్బందిగా మారాయి. మం డలకేంద్రంలో రోడ్లపై వర్షపునీరు భారీగా నిలువ ఉండిపోయింది. మెరక ప్రాంతాల్లో సైతం వరద నీరు ప్రవహించడంతో పొలాల గట్ల నుండి నిరు ప్రవహిస్తుంది. పెద్ద చెరువు కాటిచెరువు నీరు రాపాక సెంటర్ పొందూరు రహదారుల్లో గల సిస్టం కాలేజీ సమీపంలో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించింది.

చదవడం, వ్రాయటంతో పాటు సంస్కారం కలిగిన వారే నిజమైన అక్షరాస్యులు

లయన్ డా॥ఎం.కె మిశ్రో

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మినర్సుపేట గ్రామంలో కస్తూరిబా బాలిక విద్యాలయం నందు ఆదివారం ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్పర్సన్, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, సక్షం జిల్లా ఎగ్జిక్యూటివ్‌మెంబర్,ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహిత లయన్ డా॥ఎం.కె మిశ్రో మాట్లాడుతూ అక్షరాస్యత దినోత్సవం ప్రాధాన్యత మరియు ప్రతి ఒక్కరూ చదవడం వ్రాయటంతో పాటు సంస్కారంను కల్గిఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కస్తూరిబా విద్యాలయం ఉపాధ్యాయులు, సాయిబాల, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్‌పేట : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలు వలన మండలంలోని మల్లిఖార్జునపురం జంక్షన్‌లో జాతీయ రహదారికు ఆనుకుని ఉన్న వృక్షం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఫాన్‌షాప్‌పై పడిందని ఒక్కసారిగా భయంకరమైన శబ్దం వచ్చి చెట్టు నేలకొరగడంతో ఆ షాపులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు ఊపిరిపీల్చుకున్నారు.

పని సర్దు'పోటు'..!

- ఉపాధ్యాయ పోస్టుల సంఖ్య తగ్గింపు ... పాఠశాలలది అదే స్థితి

విశాలాంధ్ర - ఆమదాలవలస : అందరికీ విద్య అందుబాటులో ఉండేలా చూడాల్సిన పాలకులు అధికారులు పేద ల విద్యకు ప్రభుత్వ పాఠశాలను దూరం చేస్తున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. ప్రై వేట్ విద్యా వ్యవస్థకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని అందు కు తగ్గట్టుగానే గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత స్థాయి కల్పించి ప్రతి ఏటా ఒక్కొక్క తరగతిని పెంచుకుంటూ ఉన్నత స్థాయి పాఠశాల గా తీర్చిదిద్దరమే లక్ష్యంగా శాఖ అధికా రులు వ్యవహరించారు. గత ప్రభుత్వం జీవో 117 ను అమల్లోకి తెచ్చి మూడు నాలుగు ఐదు తరగతులను దగ్గరలో ఉన్న ఉన్నత పాఠశాలలో మెర్జి చేశారు. దీంతో విద్యా వ్యవస్థ కుంటు పడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేరికలు తగ్గాయి. అంతేకాకుండా ఉన్నవారు కూడా ప్రై వేటు పాఠశాలలను ఆశ్రయించారు. ఇది ఇలా ఉండగా ప్రాథమి కోన్నతస్థాయి నుంచి ప్రాథమిక స్థాయికి పాఠశాలలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం సన్నా హాలు చేస్తుంది. అందులో భాగంగానే నవంబర్ 2023లో 98 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్నచోట సబ్జెక్టు టీచర్లను తొలగించారు. చీమలవలస, నెల్లిపర్తి, చింతలపేట గ్రామాలను ఉపా ధ్యాయులను వేరే చోటికి బదిలీ చేశారు. అప్పట్లో చీమల వలస కు చెందిన నాయకుడు మండల స్థాయి నాయకత్వం ఉం డటంతో సభాపతి వద్ద కూర్చొని ఇంగ్లీషు తెలుగు మ్యాథమెటిక్స్ ఉన్నవారిని డి ప్యూటేషన్ పద్దతిలో నియమించుకున్నా రు. ఇటీవల ఆ పాఠశాల విద్యార్థుల తల్లి దండ్రులు ఎంఈఓ. నిర్బంధించి ఉపాధ్యా యుల తరలిస్తే ఊరుకునేది లేదని నిరసన వ్యక్తం చేశారు. అప్పటికే డిప్యుటే షన్ లో ఉన్న ఉపాధ్యాయులు ఇటీవల బదిలీలలో వేరే చోటికి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. యూపీ స్కూలును ప్రాథ మిక పాఠశాలలగానే భవిష్యత్తులో కొనసాగేలా చూసేందుకు ప్రభుత్వం ఈ చర్య లు చేపడుతుందని విద్యాశాఖ లోని కొం దరు గుసగుసలాడుతున్నారు. వచ్చే ఏడాదికి ఆరవ తరగతిలో చేర్చుకోవడం కూడా జరిగే పని కాదని కొంతమంది బా హాటంగానే చెబుతున్నారు. ఇది ఎలా ఉండగా జిల్లాలో 60 పాఠశాలలో పరి స్థితి స్థాయి తగ్గింపులో ఉన్నాయి. ఆము దాలవలస పరిధిలో నెల్లిపర్తి, చింతల పేట, చీమల వలస, అప్పల పట్నాయ కుని పేట, మదనాపురం, పాలవలస, పి పి పేట, యరగాం యూపీ పాఠశాలలో వచ్చే ఏడాదికి స్థాయి తగ్గనున్నాయి. తొగరం ఉన్నత పాఠశాలలో సోషల్, బయాలజీ, ఇంగ్లీష్, హిందీ, తెలుగు అధికంగా చూసినప్పటికీ ఇటీవల జరి గిన పని సర్దుబాటులో వారి సీనియారిటీ దృశ్య అక్కడే ఉంచారు. మరి కొంత మంది జూనియర్లను పని సర్దుబాటు పేరిన డీఈవో పూల్ కు తరలించారు. ఈసారి జరిగే ట్రాన్సుర్ లలో అదే పాఠశాలలో కొనసాగిన వారికి బదిలీ అనివార్యం కావస్తోంది.

పని సర్దుబాటు... ఇటీవల ప్రభుత్వం పని సర్దుబాటు పేరు తో మండలంలో 45 మంది ఉపాధ్యాయులు జిల్లాలో 1460 మంది రాష్ట్ర స్థా యిలో 21 600మంది పోస్టులు మిగు లు చూపించారు. దీనికి కమీషనర్ స్థా యిలో ఆన్లైన్ డేటా సబ్మిట్ చేయటం అంటే డేటాను కమిషనర్ కు అందించడమే అవుతుంది. మిగులు ఉపాధ్యా యుల బదిలీ సర్దుబాటు ఉత్తర్వులు ఆర్జెడి ద్వారా అందించడం ఇదే తొలి సారి. మిగులు ఉపాధ్యా యులను గతం లో మండల, డివిజనల్, జిల్లా ప్రాతిపది కన పూల్ అప్ చేసే సాంప్రదాయం ఉండే ది. కానీ కమీషనర్ లెవెల్ లో ఈ మూ డు దశలలోనూ పూలప్ చేయడం డేటా మొత్తం కమిషనర్ కంట్రోల్లో ఉంచడంపై భవిష్యత్తులో ఈ విధానం ఎటువైపు దా రితీస్తుందోనని ఉపాధ్యాయుల ఆందో ళనలో ఉన్నారు. సర్దుబాటు పేరుతో రేష నలైజేషన్ చేశారని మదన పడుతున్నా రు. దీంతో పని సర్దుబాటు కాదు ఉపాధ్యా యులకు పోటే అని వారు భావిస్తున్నారు.

ప్రతీ ఒక్కరూ సమాజ సేవలో పాల్గొనాలి

మన బడి వెల్ఫేర్ అధ్యక్షులు సూరిబాబు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : ఇబ్బందుల్లోఉన్న వారికి తమ వంతుగా ప్రతీ ఒక్కరూ సహాయం చేసి సమాజసేవలో పాల్గొనాలనీ సంతబొమ్మాళి మండలం, వల్లేవలస కేంద్ర స్థానంగా పని చేస్తున్న మనబడి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రెడ్డి సూరిబాబు మాస్టర్ అన్నారు. ఆదివారం ఆయనతో పాటు గేదెల శివారెడ్డి, ఇప్పిలి అప్పన్నలకు యరకన్నపేట గ్రామ పెద్దలు, యువత దుస్సాలువ, పూలదండలు, జ్ఞాపికలతో ఘనంగాసన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు, రెడ్డి సూరిబాబు మాట్లాడుతూ సన్మానాలు బాధ్యతలను పెంచుతాయనీ, మరింత మంది యువకులు సంస్థలో చేరి సంపాదనలో కొంత సొమ్ము సేవకార్యక్రమాలకు దానంచేయడం అలవాటు చేసుకోవాలన్నారు. పిల్లలను చదివించుకోలేని, అనారోగ్యంతో బాధపడుతున్న, కుటుంబాలకు, సంస్థ ఏళ్లవేళలా సేవలు అందిస్తుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు ఏదూరు చిన్న, శంకర్ రెడ్డి, ఈశ్వరరావు, అబ్బారెడ్డి, వెంకటేష్, చంద్రశేఖర్, వెంకట్ రెడ్డి, మాధవ్, తరుణ్, భరత్‌లు పాల్గొన్నారు.

వంశధార నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - హిరమండలం : వంశధార నది పరి వాహక ప్రజలు అంతా అప్రమత్తంగా ఉండాలని పాతపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం టీడీపీ నాయకులను, అధికారులను గొట్టా బ్యారేజ్ వద్ద పరిశీలించారు. వంశధార నదిలో వరద ఉద్రిత్తి పెరుగుతుందని మరింత వరద ఉధృత్తి పెరిగే అవకాశం ఉన్నందున నది పరివాహక మరియు లోతట్టు ప్రాంత ప్రజల అంత అప్రమత్తంగా ఉండాలని, నది పరివాహక ప్రాంతంలో గల ప్రజలకు మరియు పశువులను సురక్షిత ప్రాంతంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులు అంత గ్రామాల్లో గల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి ప్రజలంతా సౌకర్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాతపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడి గోవింద రావు ఆదివారం కోరారు. అలాగే నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా అధికారులు ముందోస్తు చర్యలు తీసుకోవాలని, కార్యకర్తలు నిత్యం పరిస్థితిలను తెలుసుకొని ప్రజలకు అండగా ఉండాలని, అవసరమైన వాళ్ళు క్యాంపు కార్యాలయం లో వున్నఫోన్ నెంబర్లు 6303045925, 9063970079, 8008717570, 8985808888, 9866107476, 9502514547 కాల్ చెయ్యగలరని కోరారు. వంశధార నదిని పరిశీలించిన వారిలో తహసీల్దార్ బి వెంకట్ రమణ, డిప్యూటీ తహసీల్దార్ బి వి రమణ, గొట్టా బ్యారేజి అధికారులు, ఎంపీపీ ప్రతినిధి తూలుగు తిరుపతిరావు (మాస్టర్) తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

80 గ్రాముల చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

విశాలాంధ్ర - టెక్కలి : ఈ మధ్యకాలంలో టెక్కలి, జలుమూరు, కాశిబుగ్గ, ఇచ్చాపురం ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాని టెక్కలి పోలీసులు గత నెల 19వ తేదీన నలుగురు దొంగలను అరెస్టు చేసి వారి దగ్గర నుండి 85 గ్రాముల బంగారం ఆభరణాలు, రూ.8 వేలు నగదు, ఐదు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న వారిని రిమాండ్ కి తరలించిన విషయం అందరికీ తెలిసినదే. అయితే ఆ ముద్దాయిల వద్ద నుండి మరికొంత దొంగ సొత్తును స్వాధీనం పరచుకోవాలని జేఎంఎఫ్ కోర్ట్ టెక్కలి వారు ఆదేశాల మేరకు ఏ1 ముద్దాయి (సిభుదాస్), ఏ2 ముద్దాయి (తరేమి రావు) లను ఈనెల 2వ తేదీ నుండి 7వ తేదీ వరకు తదుపరి విచారణ కోసం పోలీసులు కస్టడీకి తీసుకుని అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఏ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ చేయగా ఏ1 ముద్దాయి తెలిపిన వివరాల ఆధారంగా శుక్రవారం ఒడిస్సా రాష్ట్రం, ఖార్ధ జిల్లా, భారత్ పూర్ సాయిరాం బస్తీలో నివాసం ఉంటున్న సిభుదాస్ ఇంటి వద్దకు వెళ్లి బంగారం రాణిహారం (29.200) గ్రాములు, బంగారం ఉంగరాలు (5.700,2.820) గ్రాములు, చెవిలో పెట్టుకున్న వస్తువులు (3.560,4.050) మొత్తం 45.330 గ్రాములు, బంగారం శతమానం (2.900) గ్రాములు, చెవి వస్తువులు (4.200) గ్రాములు మొత్తం 7.100 గ్రాములు, జలుమూరు స్టేషన్ పరిధిలో నల్లపూసల బంగారం చైన్ (28.200) గ్రాములు మొత్తంగా సుమారు 80 గ్రాముల బంగారం వస్తువులు మరియు దొంగలించిన సొత్తుతో కొన్నటువంటి బజాజ్ పల్సర్ మోటార్ సైకిల్ (ఎన్.ఓ. ఓఆర్13 హెచ్ 1619 ను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ విజయ్ కుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరిపై సిఆర్ నెంబర్.322/2024 యూఎస్ 331(4), 305 ఆర్డబ్ల్యూ 317, సిఆర్ నెంబర్ 280/2024 యూఎస్ 457, 380, ఐపీసీ, సిఆర్ నెంబర్ 30/యూఎస్ 457, ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్ కి తరలించినట్లు సీఐ విజయ్ కుమార్ తెలిపారు.

ఘనంగా జనసేన జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర - నందిగాం : మండలం ఆనందపురం పంచాయతీ మాదిగాపురం గ్రామంలో ఆదివారం జనసేన పార్టీ టెక్కలి ఇన్‌చార్జ్ కమిటీ ఆధ్వర్యంలో జనసేన జెండా ఘనంగా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రతి పంచాయతీలో ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగరవేస్తామని తెలియజేశారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని క్యాడర్ కు దిశా నిర్దేశం చేశారు. టెక్కలి ఇన్చార్జి కనితి కిరణ్ మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ రాబోయే రోజుల్లో పార్టీని మరెంత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగాపురం లో కొంతమంది యువత జనసేన పార్టీలో సాధనంగా చేరారు. వీరిని పిసిని చంద్రమోహన్, కనితి కిరణ్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జనసేన జెండాను ఆవిష్కరించారు.

తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రత్యేక అధికారి అప్పలస్వామి, తహశీల్దార్ మురళీమోహన్

విశాలాంధ్ర - కవిటి : తుఫాన్ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి అప్పలస్వామి, తహసిల్దార్ మురళీ మోహన్ సూచించారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రమైన కవిటి తహసిల్దార్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి అప్పలస్వామి తో కలిసి తాసిల్దార్ మురళీమోహన్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలానికి తుఫాన్ ప్రభావంతో ఆదివారం నుండి మూడు రోజులపాటు భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ఆదేశాలు అందాయని కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఇప్పటివరకు 56.7 మిల్లీ లీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. తుఫాను సందర్భంగా మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని తెలిపారు. ప్రజలు కూడా ఆరుబయట ప్రదేశాలలో సంచరించరాదని తెలిపారు. వర్షాలు పడే సమయంలో చెట్ల కింద తలదాచుకోకూడదని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని కోరారు. మండలంలోని ఇద్దివానిపాలెం గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందజేశారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు నమోదు అవుతాయని ప్రజల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రాము, ఎంఈఓ ధనుంజయ మజ్జి, డిప్యూటీ తాసిల్దార్ రామచంద్రరావు, ఈ ఓ పి ఆర్ డి శివాజీ పాణిగ్రాహి, సీనియర్ నాయకులు రమణమూర్తి, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నేత్రదానం పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరం

విశాలాంధ్ర - టెక్కలి : నేత్రదానం పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని కళా సమితి అధ్యక్షులు యు గణపతిరావు అన్నారు. ఈ సందర్భంగా నేత్రదానం అంధులు ఆశాజ్యోతిలో భాగంగా మండలంలో స్థానిక ప్రజా చైతన్య కళా సమితి భవనం వద్ద ఆదివారం 39వ జాతీయ నేత్రదానం పక్షోత్సవాల ముగింపు పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మరణానంతరమే నేత్రదానమని అన్నారు. కళా సమితి ఆధ్వర్యంలో ఇప్పటికీ మండలంలో ఉన్న పరిసర గ్రామాల నుండి 50 మందితో నేత్రదానాలు చేయించి, 100 మంది అంధులు కళ్ళల్లో వెలుగులు నింపడం ఓ మైలురాయుని అన్నారు. అనంతరం, నేత్ర వైద్య సహాయకులు సారవకోట బి జెఎస్ ప్రసాదరావు మాట్లాడుతూ నేత్రదానం పట్ల ప్రజలలో ఉన్న అపోహలు వాటిని అధిగమించే విధానాలు, సాంకేతిక అంశాలు గురించి వివరించారు. జిల్లా రెడ్ క్రాస్ వారికి తెలియజేసే నప్పుడు వారి నేత్ర సేకరణ చేసి విశాఖపట్నంలోని మోహిసిన్ ఐ బ్యాంకు ద్వారా కార్నియా అవసరమైన వారి కంటికి అమర్చి వారి కళ్ళల్లో వెలుగులు నింపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిసెట్టి చిట్టన్న, తూట భాస్కరరావు, చిలుకు కృష్ణారావు, ఆర్‌వి రమణమూర్తి, జి మోహన్రావు, డి.పాపారావు, ఎస్.లక్ష్మణరావు, ఎం.జగన్నాధరావు, బి.శేషగిరి పాల్గొన్నారు.